‘మనూ’ ఎంపవరింగ్‌కు కేంద్రం నిధులు

రూ.95 కోట్ల నిధుల కేటాయింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంపవరింగ్ టెక్నాలజీ కోసం కేంద్రప్రభుత్వం రూ.95 కోట్ల నిధులను మంజూరు చేసింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం (సీఎస్ అండ్ ఐటీ) కోసం భారత ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ రూ.95 కోట్లను మంజూరు చేసింది. సీఎస్ అండ్ ఐటీ స్కూల్ చీఫ్ ఇన్వెస్టిగేటర్, డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ ఆధ్వర్యంలో ‘వర్చువల్ రియాలిటీ బేస్డ్ అసిస్టివ్ సిస్టమ్ ఫర్ లెర్నింగ్ అండ్ అసెస్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ ఆఫ్ ఇంటెలెక్చువల్ డిసేబిలిటీస్’ అనే ప్రాజెక్టు కోసం ఈ నిధులను పొందడం ద్వారా అన్ని అంచనాలను అధిగమించింది. ఈ ప్రాజెక్టు అమలుకు నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సర్వీసెస్ ఇన్కార్పొరేటెడ్ (ఎన్ఐసీఎస్ఐ), ఉర్దూ విశ్వవిద్యాలయం సహకరిస్తాయి.

వైస్‌చాన్స్‌లర్ సయ్యద్ ఐనుల్ హసన్ అభినందన..

కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను రూ.95 కోట్లు సాధించినందుకు ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ బృందాన్ని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు సేవచేయడం, వారిని ఉద్ధరించడంలో ఈ మార్గదర్శక ప్రయత్నం నిరంతర విజయం, సుదూర ప్రభావంపై ఆయన చాలా ఆశలు వ్యక్తం చేశారు. తరుచుగా నిర్లక్ష్యం చేయబడిన లేదా తక్కువ సేవలందించే వారి అత్యవసర అవసరాలను తీర్చేందుకు ప్రాజెక్టు కరుణ, సానుభూతిని వ్యక్త పరుస్తుందన్నారు. సామాజిక సంక్షేమానికి ఉద్దేశించిన ప్రాజెక్టులకు పెరుగుతున్న గుర్తింపు, మద్దతును ఈ నిధుల మంజూరు ద్వారా నొక్కి చెబుతున్నాయన్నారు.



ఉర్దూ విశ్వవిద్యాలయం పరిపాలనాభవనం

నూతన నటులకు వినోద్ ఫిలిం అకాడమీ మంచి వేదిక



కార్యక్రమంలో పాల్గొన్న రచయిత లక్ష్మీభూపాల్, ఇతర నటులు

బంజారాహిల్స్: వినోద్ ఫిల్మ్ అకాడమీ దిన దిన ప్రవర్థమానమై మరింతగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త సినీ నిర్మాత, డాక్టర్ పుట్టగుంట వెంకట సతీష్ అన్నారు. ప్రసాద్ లాబ్స్‌లో జరిగిన వినోద్ ఫిల్మ్ అకాడమీ తృతీయ వార్షికోత్సవంలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పుడే విజయం వరిస్తుందని ప్రముఖ నటుడు దర్శకుడు శ్రీదేవి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ... అకాడమీతో తన అనుబంధాన్ని వివరించారు. నటుడు ప్రదీప్ మాట్లాడుతూ... నటనలో ఉండే టెక్నిక్ ను పట్టుకోవాలని అన్నారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ప్రముఖ దర్శకుడు ఎ.మోహన్‌గాంధీ విద్యార్థులను ఆశీర్వదించారు. దొరసాని చిత్ర దర్శకుడు శ్రీ కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ... తాను ఎల్లప్పుడూ కొత్త నటులకు అవకాశం ఇస్తూ ఉంటానని ప్రకటించారు .సినీ పరిశ్రమలో కోటి మంది మాత్రమే ఉంటారని అందులో తాము ఉండటం ఎంతో అదృష్టమని మాటల రచయిత లక్ష్మీ భూపాల్ అన్నారు. అకాడమీ వ్యవస్థాపకుడు వినోద్ ప్రసంగిస్తూ... తమ సంస్థ అందరికీ అందుబాటులో ఉందని చెప్పారు. ప్రముఖ టెక్నాలజీ నిపుణులు నల్లమోతు శ్రీధర్,జబర్దస్త్ అప్పారావు, యూట్యూబ్ ఫాదర్ సతీష్, టీఎంటీ డీఏయూ అధ్యక్షుడు రాజశేఖర్, బబ్లు, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు. అకాడమీ ప్రిన్సిపాల్ కిషోర్ దాస్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

శ్రీనయ్యకు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌సీ)లో బాద మోని శ్రీనయ్యకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.వీబీ నరసింహ పర్యవేక్షణలో క్లౌడ్ కంప్యూటింగ్ అడాప్షన్ మోడల్ ఫర్ ఈ-గవర్నమెంట్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డాక్టరేట్‌ను అందుకున్న శ్రీనయ్యను పలువురు అభినందించారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం





శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు, అమ్మవారు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ఈ ఉత్సవాలు జనవరి 15 వరకు కొనసాగనున్నాయి. ప్రతి రోజు ఉదయం ఆరాధన సేవా కాలము, మంగళశాసనం, తీర్థ ప్రసాద గోష్టి ఉంటుందని ఆలయ కార్య నిర్వాహణాధికారి జీఏకే కృష్ణ తెలిపారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం పరిసర ప్రాంతాల భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వసతులను సద్వినియోగం చేసుకోవాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో తనిఖీలు
- బస్తీ దవాఖానాలో రికార్డుల పరిశీలన
- మునిసిపల్ అధికారులతో సమీక్ష



ప్రగతినగర్‌లో పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్



నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో..

నిజాంపేట్: ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసి వసతులను సద్వినియోగం చేసుకున్నప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం ఆయన నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్యటించారు. ఈ సందర్భంగా పార్కులు, బస్తీ దవాఖానాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ముందుగా ప్రగతినగర్ పరిధిలో ఉన్న పార్కులను సందర్శించిన కలెక్టర్ గౌతమ్ పార్కులో మొక్కలు, వాకింగ్ ట్రాక్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో ఉన్న క్రీడా మైదానాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రజలకు మంచి ఆరోగ్యం కల్పించడంతో పాటు వారికి అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉండేలా అర్బన్ పార్కులను ఏర్పాటు చేసిందన్నారు.

◆ బస్తీ దవాఖానా తనిఖీ

ప్రగతినగర్లో బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులను పలకరించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే ప్రజలతో సిబ్బంది ఆత్మీయంగా మాట్లాడాలని, అప్పుడే ప్రజలకు వైద్యుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులు, రిజిష్టర్లు, మందులకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఆసుపత్రి స్టాక్ రిజిస్ట్రర్‌ను పరిశీలించి అవసరమైన మందులను తెప్పించుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. ల్యాబ్‌లో డయాగ్నస్టిక్‌కు సంబంధించి వస్తున్న రోజువారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

◆ మున్సిపల్ అధికారులతో సమీక్ష..

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆయా విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చెందేందుకు అందరి సహకారం అవసరమన్నారు. సకాలంలో మున్సిపల్ టాక్స్‌లు వసూలయ్యేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా మున్సిపల్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు తగినన్ని నిధులు సమకూరతామన్నారు. పార్కులు, రోడ్లు, డ్రైనేజీ తదితర ముఖ్య వసతులను ఎప్పటికప్పుడు మెరుగు పరచాలని, ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, బాచుపల్లి తహశీల్దార్ పుల్ సింగ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రగతినగర్ బస్తీ దవాఖానాలో తనిఖీలు



బస్తీ దవాఖానాలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

కూకట్‌పల్లి: నవ్యాంధ్ర అభివృద్ధి ప్రదాత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఉదయం కూకట్‌పల్లి, బాలాజీనగర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్ఆర్ అభిమానులు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ నుంచి రమ్యా గ్రౌండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్, జగన్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేవైసీ అప్‌డేట్ కోసం ఉరుకులు.. పరుగులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ పొందాలంటే ఆధార్ వివరాలు, గ్యాస్ బిల్లులతో వచ్చి కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని ప్రచారం జరగడంతో ఏజెన్సీల వద్ద వినియోగదారులు బుధవారం బారులు తీరారు. కూకట్‌పల్లిలోని ట్రినిటీ ఇండేన్‌గ్యాస్ ఆఫీస్ వద్ద జరిగిన తోపులాటలో కార్యాలయ ఉద్యోగి ఒకరికి గాయాలయ్యాయి. ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి విధి విధానాలు ప్రకటించకపోయినా సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరగటంతో వినియోగదారులు గ్యాస్ ఆఫీసులకు పోటెత్తారు.

వ్యాపారులు చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలి



మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే

బంజారాహిల్స్: వ్యాపార వాణిజ్య సంస్థల నుంచి చెత్తను స్వచ్ఛ ఆటోలకు తప్పనిసరిగా చేర్చే విధంగా ఎస్ఎఫ్ఏలు దృష్టిసారించాలని రోడ్ల పైన వ్యాపారులు చెత్త వేయకుండా చూడాల్సిన బాధ్యత వారిదేనని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-17 ఖైరతాబాద్‌కు చెందిన 30 మంది ఎస్ఎఫ్ఏలతో బుధవారం ఆయన తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... చెత్త కుప్పలను తయారు చేయకుండా, చెత్తను బయట వేయకుండా వ్యాపారులకు తగిన అవగాహన కలిగించాలని ప్రతి వ్యాపారితో స్వచ్ఛ ఆటోలకు లింకును కుదర్చాలని ఈ బాధ్యతను ఎస్ఎఫ్ఏలే తీసుకోవాలని అన్నారు. చాలా దుకాణాల ముందు, వాణిజ్య సంస్థల ముందు చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఇక నుంచి గార్బేజ్ వర్నబుల్ పాయింట్లు లేకుండా చూడాలన్నారు. సర్కిల్-17 ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

భళా.. విశ్వం ఆవిర్భావంపై విద్యార్థుల ఆవిష్కరణలు



శ్రీనగర్‌కాలనీ: భారతీయ సంస్కృతి-సంప్రదాయాలు, విశ్వం ఆవిర్భావం, గ్రహాలు వంటి వాటిపై విద్యార్థులు చేసిన ప్రయోగ ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. బుధవారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో ప్రజా మేళా పేరిట సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు భారతీయ పురాతన సంప్రదాయాలు, విశ్వంలోని గ్రహాలు, వాతావరణ విషయాలను తెలుపుతూ తయారు చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. సైన్స్, కళల పట్ల మరింత అవగాహన పెంచేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశామని స్కూల్ సీఈఓ మోహనవంశీ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ మధుమతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అమీర్‌పేట: ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అంది పుచ్చుకోవాలని తమిళనాడు రాష్ట్ర సమాచార, ఐటీ శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ అన్నారు. ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో బుధవారం బ్రిడ్జి-23 సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. స్థిరమైన ఆర్థిక వృద్ధి, మానవ మూలధనాన్ని నిర్మించుకోవడం, వృద్ధిని వేగవంతం చేయడం వంటి అంశాలు దేశ, సామాజిక ప్రగతికి కారణాలవుతాయని అన్నారు.అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత విద్యా సంస్థలపై ఉందన్నారు. పెరుగుతున్న జనాబా, ఆర్థిక అవసరాల దృష్ట్యా విద్యా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే కోర్సులపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఐసీటీ అకాడమీ సేవలను అభినందించారు. దేశ వ్యాప్తంగా ప్రతి యేడాది పారిశ్రామిక, విద్యావేత్తలు, విద్యార్థులకు శిక్షణనిస్తూ ఆర్థిక ప్రగతికి దోహదపడటం గొప్ప విషయంగా అభివర్ణించారు. ఐసీటీ అకాడమీ సీఈఓ హరిబాలచంద్రన్, చైర్మన్ ఫాల్కన్, జాతీయ ప్రతినిధి గణేష్ కార్తిక్, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ప్రతినిధి దివాకర్ రెడ్డి, హైదరాబాద్ చాప్టర్ ప్రతినిధి శ్రీనివాస్య పాల్గొన్నారు.

పగలే వెన్నెలా...

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ 60 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లు పట్టపగలు వెలుగుతూనే ఉన్నాయి. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోజుల తరబడి వీధి లైట్లు వెలుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారున. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు వీధి లైట్లు ఆన్ చేసి ఉదయం 6 గంటలకు ఆఫ్ చేయాల్సి ఉండగా సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పట్టపగలు లైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గాయత్రినగర్‌లో పట్టపగలు వెలుగుతున్న హైమాక్స్ లైట్లు..

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా బండి రమేష్



కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా బండి రమేష్ కొనసాగనున్నారు. ఈ మేరకు అధిష్టానం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను నియోజకవర్గాల ఇన్‌చార్జీలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ నిర్ణయంపై బండి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



బండి రమేష్‌ను అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

బండి రమేష్‌కు శుభాకాంక్షలు...

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన బండి రమేష్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో గంధం రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డి.రంగస్వామి, పాడుగు అప్పారావు, మఖ్దూం, జి.లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా

కూకట్‌పల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడు ముందుంటానని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భగా బండి రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు రేవంత్‌రెడ్డి చేసిన కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రేష్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేయించి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, అశోక్, రాజశేఖర్‌రెడ్డి, వినయ్ ముదిరాజ్, పఠాన్, ఇమ్రాన్, అక్బర్, నయీమ్, నరసింహ, భారతమ్మ, జ్యోతి, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బండి రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన గంధం రాజు తదితరులు

నేడు నిధి ఆప్కే నిఖత్...

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిధి ఆప్కే నిఖత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. గురురవారం ఉదయం 9నుంచి సాయంత్రం 6 గంటల వరకు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఖాతాదారులు కండ్లకోయలోని నీరజ్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో,మేడ్చల్ జిల్లాకు చెందిన ఖాతాదారులు కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, బహదూర్‌పల్లిలోని ఆహ్లాద ఇంజినీర్స్ క్యాంపస్‌లో హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామరన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఇఎల్, జీడిమెట్ల,సనత్‌నగర్ తదితర ప్రాంతాల ఖాతాదారులు పాల్గొనవచ్చన్నారు.

నేడు అవని ఫెర్టిలిటీ ఆండ్రాలజి హాస్పిటల్ ప్రారంభం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1లోని మేగ్నస్ డయాగ్నస్టిక్ పై అంతస్తుపై అవని ఫెర్టిలిటీ ఆంథ్రాలజి హాస్పిటల్‌ను గురువారం ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. తమ ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియర్ డైరెక్టర్, ఫెర్టిలిటి కన్సల్టెంట్ డా. టి. యస్ శాలినీ పర్యవేక్షణలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ఘనంగా మహా పడిపూజ



మహాపడి పూజలో పాల్గొన్న పన్నాల హరీష్ రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కేపీహెచ్‌బీ డివిజన్ ఎంఐజీ ప్లాట్స్‌లో నివాసం ఉండే బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీరామ్‌రెడ్డి నివాసంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ రంగధాముని చెరువు సమీపంలోని రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 23న శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి వైకుంఠద్వార దర్శనం, గోపూజ, జనవరి 6న రంగనాథ స్వామి అభిషేక మహోత్సవం, ఆదివారం తులసి దలార్చన, సాయంత్రం 5 గంటలకు దీపోత్సవం, 11న కుడార్త్రై ఉత్సవం స్వామికి 108 పాత్రలతో ప్రసాద నివేదన, 14న ఉదయం 10 గంటలకు రంగనాయక స్వామి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, గురుకుల పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నాయకులు గూడ ఐలయ్య ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఐలయ్య తెలిపారు.

సయ్యద్ రహమాన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిసయ్యద్ ఇనాముర్ రహమాన్‌కు పీహెచ్‌డీ డిగ్రీని బుధవారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అనువాద అధ్యయనాల విభాగంలో ఆయన పరిశోధక విద్యార్థిగా కొనసాగుతున్నారు. ఆయన ‘మహాత్మా గాంధీ సే ముతల్లిక్ అంగ్రేజీ కిలాబోన్‌కీ ఉర్దూ తరాజిమ్: ఏక్ జాయేజా’ అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను ఆయన సమర్పించారు. ఆయన ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ మహమూద్ కజ్మీ పర్యవేక్షణలో ఈ పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఆయనను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

‘షీటీమ్స్’ ఫిర్యాదులు

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మహిళలు షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయాలంటే ఈ క్రింది నంబర్లకు వాట్సప్ లేదా ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చు.

- సైబరాబాద్ షీ టీమ్స్ సందేశాలు పంపాల్సిన నెంబరు 9490617444
- బాలానగర్- 9490617 349 ◆ ఐటీకారిడార్- 9490617352
- మాదాపూర్-8333993519 ◆ కూకట్‌పల్లి- 9493626811
- జగద్గిర్‌గుట్ట- 9493624561 ◆ మియాపూర్- 9491051421
- పేట్ బషీరాబాద్- 7901114137 ◆ శంషాబాద్- 9490617354
- దయల్- 100కు కూడా ఫిర్యాదు చేయొచ్చు.

23న ముక్కోటి ఏకాదశి వేడుకలు

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ వేడుకలను ఆలయ అర్చకుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. ఆలయంలో తెల్లవారుజామున 4.30 గంటలకు కాగడ హారతితో వేడుకలను ప్రారంభిస్తామని, అనంతరం 5గంటలకు వినాయక, దత్తాత్రేయ, షిర్డీసాయిబాబా వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామని ప్రకటించారు. 6 గంటల నుంచి భక్తులు షిర్డీసాయిబాబా వారికి ప్రత్యేకంగా ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే అవకాశం ఉండటంతో భక్తులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు.

నేడు జీఐఎల్‌టీలో ‘సృజన టెక్ ఫెస్ట్’

రాయదుర్గం: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో గురువారం ‘సృజన టెక్‌ఫెస్ట్’ పేరిట ప్రత్యేక టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జీఐఎల్‌టీ ప్రిన్సిపల్ ఎస్.ఎక్బాల్‌హుస్సేన్ తెలిపారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీలో ఉదయం 9.30 గంటలకు స్పెషల్ బ్రాంచ్ క్లస్టర్ కోసం జిల్లాస్థాయి రంగారెడ్డిజిల్లా సృజన టెక్‌ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫెస్ట్ ద్వారా విద్యార్థులలో సాంకేతిక ప్రాజెక్టుల ద్వారా వినూత్న ఆలోచన, ఆచరణాత్మక నైపుణ్యాలను ప్రోత్సహించడమే ఈ ఫెస్ట్ ప్రధాన లక్ష్యమన్నారు. విద్యార్థులకు కూడా తమలోని సృజనాత్మకతను, నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలను వెలికితీసేందుకు అవకాశం కల్పించినట్లవుతుందన్నారు. అత్యుత్తమ ప్రాజెక్టును ఎంపిక చేసి రాష్ట్రస్థాయి సృజన టెక్‌ఫెస్ట్ పోటీలకు పంపుతామని ఆయన వివరించారు.

‘వారం రోజులు సమాజ సేవ చేయాలి’

సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులో న్యాయస్థానం తీర్పు

బంజారాహిల్స్: సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడిన బాలుడికి వారం రోజుల పాటు సమాజ సేవ చేయడంతో పాటు ఏడాది పాటు జిల్లా సంక్షేమాధికారి పర్యవేక్షణలో ఉండేలా నాంపల్లిలోని అయిదవ మెట్రోపాలిటన్ జువైనల్ కోర్టు మెజిస్ట్రేట్ బుధవారం తీర్పునిచ్చారు. 2019లో ఓ బాలుడు సెల్‌ఫోన్ స్నాచింగ్ చేయగా బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి జూబ్లీహిల్స్ డీఎస్ఐ వి. శివ శంకర్ ఈ చోరీకి సంబంధించి ఐపీసీ సెక్షన్ 382 కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించడమే కాకుండా కోర్టుకు పక్కా ఆధారాలు సమర్పించారు. శాస్త్రీయ ఆధారాలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జి. రాధిక ఈ మేరకు బాలుడికి ఏడాది పాటు డీపీవో పర్యవేక్షణలో ఉండే విధంగా తీర్పునిచ్చారు.